క్లుప్తంగా

ఆటో డ్రైవర్లూ.. పిల్లలతో అప్రమత్తం



ఆటో డ్రైవర్లకు సూచనలిస్తున్న ఎస్సై మౌనిక

సామర్లకోట: ఆటో డ్రైవర్లు స్కూల్ పిల్లలను తీసుకువెళ్లే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్సై మౌనిక అన్నారు. గురువారం సాయంత్రం స్థానిక స్టేషన్ సెంటర్‌లో ఆటో డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. ఆటోలలో ఎక్కువ మంది పిల్లలను తీసుకువెళ్లడంతో పాటు వారి బ్యాగ్‌లను వేలాడదీస్తూ ఆటోలు వెళ్తున్నాయని అన్నారు. పరిమితిని మించి తీసుకు వెళ్లవద్దని సూచించారు. విద్యార్థుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా కాకీడ్రెస్ ధరించాలన్నారు. ప్రతి ఆటోలోను రికార్డులు ఉంచాలని సూచించారు. ఇన్స్యూరెన్స్ తప్పని సరిగా చేయించుకోవాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని సూచించారు. మోటారు సైకిళ్లపై ట్రిపుల్‌డ్రైవింగ్ చేస్తున్న వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు.

వాతావరణ ఆధారిత పంటలు సాగు చేయాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న భ్రమరాంబ

పిఠాపురం: రైతులు వాతావరణ ఆధారిత పంటల సాగు చేపట్టాలని జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు భ్రమరాంబ సూచించారు. పిఠాపురం మండలం విరవలో గురువారం సర్పంచ్ నడిగట్ల చింతలరావు అధ్యక్షతన రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భ్రమరాంబ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం, వాతావరణ ఆధారిత పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలన్నారు. భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా ఎరువుల యాజమాన్యం తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులకు సాగుపై పలు సూచనలు సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఎ.అచ్యుతరావు, వీఏఏ రమ్యశైలి, రైతులు పాల్గొన్నారు.

ఇంటింటికీ తపాలా సేవలు



ర్యాలీ నిర్వహిస్తున్న తపాలా ఉద్యోగులు

పెద్దాపురం: ఇంటింటికీ తంతి తపాలా శాఖ సేవలను మరింత విస్తృతం చేస్తామని పెద్దాపురం బ్రాంచి పోస్టల్ ఇన్స్పెక్టర్ నాయుడు అన్నారు. పట్టణంలో గురువారం తపాలా సేవలపై భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయుడు మాట్లాడుతూ తపాలా శాఖ బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. యాక్సిడెంటల్ పాలసీ, ఫిక్స్‌డ్ డిపాజిట్ వంటి పథకాలపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సాగర్, పోస్ట్ మాస్టర్ ప్రసాద్, వరహాలబాబు, బీపీఎంలు, ఏబీపీఎస్‌లు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై ఏబీవీపీ పోరాటం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

పెద్దాపురం: విద్యారంగ సమస్యల పరిష్కారంలో అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్ (ఏబివిపి) పాత్ర కీలకమని ఆ సంఘం కో కన్వీనర్ కె.లలిత్‌కుమార్ అన్నారు. ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో భాగంగా గురువారం స్థానిక లూథరన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ (లెమ్స్)లో విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

ఒక్కరికే వందనం !

- కుటుంబంలో ఒక్కరికే తల్లికి వందనం పథకం అమలు
- జీవో విడుదల చేసిన ప్రభుత్వం
- ఆందోళన చెందుతున్న తల్లిదండ్రులు

పిఠాపురం/కొత్తపల్లి: తాము అధికారంలోకి వస్తే ఎంతమంది పిల్లలు ఉంటే అందరికీ తల్లికి వందనం పథకం కింద రూ.15 వేలు ఇచ్చి ఆదుకుంటామని గత ఎన్నికల్లో కూటమి నేతలు హామీ ఇచ్చారు. ఇది నమ్మి విద్యార్థుల తల్లిదండ్రులు కూటమికి ఓట్లేశారు. నూతన ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఉత్తర్వులు వస్తాయని ఆశించిన తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో చేర్పించారు. ఎంత మంది ఉంటే అంతమందికీ తల్లికి వందనం పథకం వస్తుందన్న ధీమాతో ఫీజులు చెల్లించలేదు. కాగా తల్లికి వందనం పథకం అమలుకు సంబంధించి ప్రభుత్వం జీవో విడుదల చేసింది. కుటుంబంలో ఒక్కరికి మాత్రమే పథకం వర్తిస్తుందని చెప్పడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వ జీఓ చూసిన ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలు ఫీజు చెల్లించాలని తల్లులపై ఒత్తిడి తీసుకువస్తున్నాయి.

గతంలో పక్కాగా...

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విద్యాసంస్థలు తెరిచిన తక్కువ సమయంలోనే తల్లుల ఖాతాల్లో అమ్మఒడి పేరిట రూ.15 వేలు జమ చేసేది. ఐదేళ్ల పాటు విద్యార్థుల చదువులకు ఏ విధమైన ఇబ్బందులు లేకుండా గత ప్రభుత్వం చర్యలు తీసుకుంది. కాగా ఎన్నికల సమయంలో అమ్మఒడికి బదులుగా తల్లికి వందనం పథకాన్ని కూటమి ప్రభుత్వం మ్యానిఫెస్టోలో పెట్టింది. దీంతో తమ పిల్లలకు బంగారు భవిష్యత్ ఉంటుందని భావించిన ప్రజలు కూటమికి ఓట్లు వేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే తల్లికి వందనం పథకంపై ప్రభుత్వం ప్రకటన చేస్తుందని ఆశించారు. ఇందుకు భిన్నంగా నెల రోజుల సమయం తీసుకుని ఒక్కరికే తల్లికి వందనం ఇస్తామని చెప్పడంతో తల్లులు హృదయాలు తల్లడిల్లుతున్నాయి.

గత ఏడాది వరకు 25,782 మందికి లబ్ధి

సామర్లకోట: పెద్దాపురం నియోజకవర్గ పరిధిలో గత ఏడాది వరకు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 25,782 మంది విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాల్లో అమ్మఒడి పథకంలో రూ.13 వేలు చొప్పున ఆర్థిక సాయం అందజేసినట్టు విద్యాశాఖాధికారులు తెలిపారు. అయితే ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించి తుది జాబితా తయారు కాలేదని వారు చెప్తున్నారు.

తల్లికి వందనం కోసం ఎదురు చూపులు



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తమ పిల్లలకు తల్లికి వందనం పేరుతో ఎంత మంది పిల్లలున్నా అందరికీ ఆర్థిక సహాయం చేస్తారని చెప్పారు. ఇప్పటి వరకు ఈ పథకం అమలు కాలేదు. గత ప్రభుత్వంలో జూన్ నెలలో అమ్మఒడి పథకం సొమ్ము బ్యాంకు ఖాతాలో జమ అయ్యేది. పెద్ద కుమార్తె గ్రీష్మ వర్షిత పదో తరగతి ఉత్తీర్ణురాలవగా, రెండో కుమార్తె వైష్ణవి అవంతిక ప్రతిభా విద్యానికేతన్‌లో 8వ తరగతి చదువుతోంది. ఇద్దరికీ తల్లికి వందనం వస్తుందని పెద్ద కుమార్తెను ప్రభుత్వ కోటాలో సీటు రావడంతో ట్రిపుల్ ఐటీలో చేరుస్తున్నాను. ప్రైవేటు స్కూల్‌లో చదివే పిల్లలు తల్లికి వందనం రాదని, ఒకరికే వస్తుందనే ప్రచారం జరగడంతో తమపై ఆర్థిక భారం పడే అవకాశం ఉంది. ఇప్పటి వరకు తల్లికి వందనంపై స్పష్టత ఇవ్వలేదు.

– కర్రి వెంకటలక్ష్మి, గృహిణి, సామర్లకోట

ప్రైవేటు స్కూల్‌లో జాయిన్ చేశాం



ఎన్నికల సమయంలో కూటమి నేతలు ఎంత మంది పిల్లలు చదివిస్తే అంతమందికీ అమ్మకు వందనం పథకం ద్వారా రూ.15 వేలు అందిస్తామని హామీ ఇచ్చారు. నాకు ఇద్దరు పిల్లలు. పెద్దబ్బాయి భరత్ కొమరగిరి జిల్లా పరిషత్ పాఠశాలలో మూడో తరగతి, విష్ణు అర్జున్ ప్రైవేట్ పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్నాడు. ప్రభుత్వం మాటలు విని ప్రైవేటు పాఠశాలలో జాయిన్ చేశాం. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చినా ఇప్పటివరకూ అమ్మకు వందనం పథకం అమల్లోకి రాలేదు. పైగా ఇప్పుడు ఒకరికే ఇస్తామంటున్నారనే వార్తలు వినబడుతున్నాయి. గతంలో అయితే ఇప్పటికే అమ్మఒడి డబ్బులు అందేవి.

– ఎస్. సత్యవేణి, కొమరగిరి

గతంలో ఈపాటికే అమ్మఒడి వచ్చేది



గత ప్రభుత్వంలో ఈపాటికే అమ్మఒడి సొమ్ము తల్లులు బ్యాంక్ ఖాతాలోకి జమ చేసేవారు. ఈ ఏడాది పాఠశాలలు ప్రారంభమై ఏడాది గడుస్తున్నా కూటమి ప్రభుత్వం అమ్మఒడి పథకం ఊసేలేదు. మాకు ఇద్దరు పిల్లలు. పెద్దబ్బాయి సంతోష్ కొండెవరం జిల్లా పరిషత్ పాఠశాలలో 10వ తరగతి, చిన్నబ్బాయి శుభకర్ 9వ తరగతి చదువుతున్నారు. వారిద్దరికీ అమ్మఒడి వస్తుందని భావిస్తున్నాం.

– గొడుగు మణి, కొండెవరం

యాజమాన్య పద్ధతులు పాటించాలి



పత్తి సాగులో యాజమాన్య పద్ధతులు వివరిస్తున్న శాస్త్రవేత్తలు

పిఠాపురం: పత్తి సాగు చేసే రైతులు యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా మంచి దిగుబడులు సాధించవచ్చని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. గొల్లప్రోలు మండలం దుర్గాడ రైతు సేవ కేంద్రంలో పత్తి పంట యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ దయాకర్, డాక్టర్ సీతారామశర్మ పత్తి పంట వేసేటప్పుడు తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలను రైతులకు వివరించారు. రైతులకు ముఖ్యంగా గులాబి రంగు పురుగు, పిండి నల్లి నివారణకు చర్యల తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ పంపన సూర్యచంద్రరావు, డీపీటీ (ఆత్మ) డిప్యూటీ డైరెక్టర్, జ్యోతిర్మయి, పిఠాపురం వ్యవసాయ సహాయ సంచాలకులు పి.స్వాతి, వ్యవసాయ అధికారి కేవీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

భోజనం రుచిగా లేదు

- విద్యాశాఖ ఏడీ నాగేశ్వరరావు అసంతృప్తి
- రుచి లేని సాంబారు, పొగ వాసనతో అన్నంపై ఫిర్యాదు చేసిన విద్యార్థులు
- నిత్యం రుచి చూసి రిపోర్టు ఇవ్వాలని ఉపాధ్యాయులకు ఆదేశం



విద్యార్థులతో కలిసి భోజనం చేసిన జిల్లా విద్యాశాఖ ఏడీ నాగేశ్వరరావు

సామర్లకోట: మండల పరిధిలోని నవర జిల్లా పరిషత్తు హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనం నాసిరకంగా ఉండటంతో విద్యాశాఖ సహాయ సంచాలకులు పి.నాగేశ్వరరావు అసంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలను ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో రికార్డులు, విద్యార్థుల మౌలిక సదుపాయాలను పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. సాంబారు రుచిగా లేదని, పొగ వాసన వస్తోందని అసంతృప్తి వ్యక్తం చేశారు. అదే విధంగా కోడిగుడ్లు కూడా సక్రమంగా ఉడకలేదన్నారు. రాగి జావ భోజనంతో పాటు తీసుకురావడం వల్ల విద్యార్థులు తీసుకోవడం లేదని తెలిసి ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రాగి జావ ఉదయమే విద్యార్థులకు ఇవ్వాలని ఏడీ సూచించారు. మధ్యాహ్న భోజనం జిల్లాలోని అల్లూరి సీతారామరాజు ఎడ్యుకేషనల్ సొసైటీ (స్వచ్ఛంద సంస్థ) నుంచి సరఫరా అవుతోందని ఉపాధ్యాయులు తెలిపారు. విద్యార్థులతో ముచ్చటించిన సందర్భంగా భోజనం బాగోలేదని వారు చెప్పడంతో రుచిగా లేని భోజనాన్ని పిల్లలు ఎలా తింటారని ఉపాధ్యాయులను ప్రశ్నించారు. ప్రతి రోజు ఉపాధ్యాయులు భోజనం రుచి చూసి నివేదిక ఇవ్వాలని సూచించారు. రోజూ వస్తున్న విద్యార్థుల సంఖ్య, భోజనం చేస్తున్న వారి సంఖ్యను తెలుసుకున్నారు. పాఠశాలలో ఆర్వో ప్లాంటును, పరిసరాలను ఆయన పరిశీలించి ఉపాధ్యాయులకు సూచనలు ఇచ్చారు.

8వ వేతన సంఘాన్ని నియమించాలి

- కోవిడ్ కాలంలో నిలిపివేసిన డీఏ విడుదల చేయాలి
- నూతన పెన్షన్ విధానాన్ని వ్యతిరేకిస్తూ రైల్వే ఉద్యోగుల ధర్నా



ధర్నా చేస్తున్న రైల్వే ఉద్యోగులు

సామర్లకోట: రైల్వే ఉద్యోగులకు అమలు చేస్తున్న నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రైల్వే ఉద్యోగులు గురువారం ధర్నా చేశారు. రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ ఆధ్వర్యంలో స్థానిక రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజినీరు కార్యాలయం వద్ద ధర్నా చేశారు. పెన్షన్ ప్రతి కార్మికుని హక్కు అని దాని కోసం కార్మికులందరూ ఐక్యంగా పోరాడాలని యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎం రమేష్ పిలుపునిచ్చారు. 8వ వేతన కమిషన్ వెంటనే నియమించాలని డిమాండ్ చేశారు. కోవిడ్ సమయంలో నిలిపివేసిన డీఏ బకాయిలను విడుదల చేయాలని, రైల్వే ఉద్యోగుల న్యాయబద్ధమైన కోర్కెలను అమలు చేయాలని, పాత పెన్షన్ విధానం అమలు చేయాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ చైర్మన్ ఈశ్వరరావు, వర్కింగ్ చైర్మన్ రామకృష్ణ, అసిస్టెంట్ సెక్రటరీ విశ్వప్రసాద్, వైస్ చైర్మన్ గోపాలరెడ్డి, కార్యవర్గ సభ్యులు, రైల్వే ఉద్యోగులు, మాజీ కార్యదర్శి కేవీ వెంకటేశ్వరరావు, సీనియర్ సెక్షన్ ఇంజినీర్ రామసుబ్బారావు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థుల ఎంపిక



పిల్లా హర్షిణి



డి రవికిరణ్



పుప్పాల హరిణి



కొలబండి దివ్యశ్రీకాంతి



వానపల్లి మీనాక్షి



సూరంపూడి విజయ



కట్టా మౌనిక



బాసం నందిని

సామర్లకోట: స్థానిక ప్రభుత్వ హైస్కూళ్లలో పదో తరగతిలో మంచి మార్కులు సాధించిన నలుగురు విద్యార్థులకు ట్రిపుల్ ఐటీలో సీట్లు వచ్చాయి. ఈ మేరకు ఆయా పాఠశాలల హెచ్ఎంలు వివరాలు తెలిపారు. స్థానిక యార్లగడ్డ అక్కిరాజు మున్సిపల్ హైస్కూల్‌కు చెందిన పిల్లా హర్షిణి, స్థానిక ప్రభుత్వ హైస్కూల్‌కు చెందిన డి.రవికిరణ్, అయోధ్యరామపురంలోని బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌కు చెందిన పుప్పాల హరిణి, కొలబండి దివ్యశ్రీకాంతి శ్రీకాకుళంలోని ట్రిపుల్ ఐటీకి, వానపల్లి మీనాక్షి ఒంగోలు ట్రిబుల్ ఐటీకి ఎంపికైనట్టు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు యు.సత్యనారాయణ, ప్రసూన, తోటకూర సాయిరామకృష్ణ తెలిపారు. విద్యార్థులను ఎంఈఓలు వై.శివరామకృష్ణయ్య, పి.పుల్లయ్య తదితరులు అభినందించారు.

వేట్లపాలెం హైస్కూల్ నుంచి ముగ్గురు..

వేట్లపాలెం జెడ్పీ హైస్కూల్ నుంచి ముగ్గురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారని ఆ పాఠశాల హెచ్ఎం పి.అనురాధ తెలిపారు. గురువారం సాయంత్రం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ సూరంపూడి విజయ, కట్టా మౌనిక నూజివీడు ట్రిబుల్ ఐటీకి ఎంపిక కాగ, బాసం నందిని శ్రీకాకుళం ట్రిబుల్ ఐటీకి ఎంపికయ్యారని తెలిపారు.

వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ రమేష్

- జిల్లా విద్యాశాఖాధికారి రమేష్

పెద్దాపురం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా విద్యాశాఖాధికారి పి.రమేష్ అన్నారు. స్థానిక శ్రీ ప్రకాష్ సినర్జీ పాఠశాలలో గురువారం జిల్లాలోని మండల విద్యాశాఖాధికారులు, ఆయా పాఠశాలల హెచ్ఎంలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ రమేష్ మాట్లాడుతూ ఫేజ్-2 ద్వారా ఆయా పాఠశాలలకు మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపట్టామన్నారు. విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు రెండు రోజుల్లో అన్ని రకాల పనులను పూర్తి చేయాలని డీఈఓ ఆదేశించారు. అనంతరం పలు అంశాలపై సమీక్షించారు. ఈ సమావేశంలో డీవైఈఓ ఎస్.వెంకటేశ్వరరావు, డీసీఈబీ కార్యదర్శి ఎం.వెంకట్రావు, డీఈ నాగేంద్ర, ఎంఈఓలో చౌదరి, శర్మ, ఆయా మండలాల ఎంఈఓలు, హెచ్ఎంలు పాల్గొన్నారు.

నేడు మరిడమ్మ ఆలయం మూసివేత

పెద్దాపురం: స్థానిక మరిడమ్మ తల్లి జాతర ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారి ఆలయాన్ని మూసివేస్తున్నట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ రామ్మోహనరావు తెలిపారు. గురువారం అమ్మవారికి కుంభం వేసిన నేపథ్యంలో అమ్మవారి ఆలయాన్ని తెరవబోరని, భక్తులు సహకరించాలన్నారు. శనివారం ఉదయం అమ్మవారి ఆలయాన్ని యథావిధిగా తెరుస్తామని, భక్తులు అమ్మవారిని దర్శించుకుని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఈఓ కోరారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

కొత్తపల్లి: విద్యుత్ లైన్లపై ఉన్న చెట్టు కొమ్మల తొలగింపు కారణంగా శుక్రవారం మండల పరిధిలోని పలు గ్రామాల్లో విద్యుత్ సనఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఏఈ ప్రభాకర్ గురువారం తెలిపారు. మండలంలోని యండపల్లి, నాగలపల్లి, రమణక్కపేట, నాగులపల్లి ఉప్పరగూడెం గ్రామాల్లో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

సబ్ డివిజన్ పరిధిలో..

సామర్లకోట: స్థానిక సబ్ డివిజన్ పరిధిలోని 33/11 కేవీ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల వల్ల శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు ఎవీఎన్‌డీఎస్ ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. దీని వల్ల పట్టణ పరిధిలోని భీమవరపుపేట, బళ్లమార్కెట్, గోలివారి వీధి, సంగీతరావుపేట, వీర్రాఘవపురం, మఠంసెంటర్, ప్రెసిడెంట్‌గారి వీధి, బస్సు కాంప్లెక్స్, కొత్తూరు, సంపెంగతోట, నిమ్మతోట, అయోధ్య రామపురంలో విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు. విద్యుత్ వినియోగదారులు అసౌకర్యాన్ని గమనించాలన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

కాకినాడ: సీజనల్ వ్యాధులైన అతిసారం, డెంగీపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు స్థానిక మెయిన్ రోడ్ లోని సూపర్ బజార్ నుంచి జగన్నాథపురం వరకు గురువారం ర్యాలీ నిర్వహించారు. సూపర్ బజార్, మసీద్ సెంటర్, గ్లాస్ హౌస్, గోల్డ్ మార్కెట్ సెంటర్ మీదుగా జరిగిన ఈ ర్యాలీని ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ప్రారంభించారు. పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధులను నియంత్రించవచ్చునని ఎమ్మెల్యే, కమిషనర్ వెంకట్రావు సూచించారు. సీజనల్ వ్యాధుల ప్రభావం కనిపిస్తే నగరపాలక సంస్థ టోల్ ఫ్రీ నెంబర్ 1800 4255 990ను సంప్రదించవచ్చునన్నారు. ర్యాలీలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి నాగేశ్వర నాయక్, కార్పొరేషన్ ఎస్ఈ పి.సత్యకుమారి, స్మార్ట్ సిటీ ఎస్ఈ వెంకటరావు, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీ చరణ్, ఈఈ మాధవి, సిటీ మిషన్ మేనేజర్ డేగల వెంకటరాజు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, ఆర్పీలు, సీఓలు ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్వాడీలు పాల్గొన్నారు.

ఉప్పాడ తీరంలో పోలీసుల మాక్ డ్రిల్



ఉప్పాడతీరంలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

కొత్తపల్లి: మండలంలోని ఉప్పాడ సాగరతీరం పోలీసుల సైరన్‌లతో ఒక్కసారిగా ఉలిక్కి పడింది. తీరాచూస్తే పోలీసులు నిర్వహిస్తున్న మాక్‌డ్రిల్‌తో మత్స్యకారులు ఊపిరి పీల్చుకున్నారు. ఉప్పాడశివారు ఎస్పీజియల్ నుంచి పొన్నాడ శివారు కోనపాపపేట వరకూ తీరప్రాంతాన్ని గురువారం పోలీసులు జల్లెడ పట్టారు. పిఠాపురం సీఐ శ్రీనివాస్, కొత్తపల్లి ఎస్సై స్వామినాయుడు ఆధ్వర్యంలో పోలీసులు మాక్‌డ్రిల్ నిర్వహించారు. కొత్తపల్లి, పిఠాపురం, పిఠాపురం రూరల్, గొల్లప్రోలుకు చెందిన సుమారు 50 మంది పోలీసులు గస్తీ నిర్వహించారు. మూడురోజుల పాటు ఈ మాక్ డ్రిల్ నిర్వహించనున్నట్టు పోలీసులు తెలిపారు. సముద్రం, తీరప్రాంతంలో అనుమానిత వ్యక్తులు బోట్లలో సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

భారతీయ న్యాయ సంహిత క్రిమినల్ చట్టాలపై అవగాహన



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

పిఠాపురం: మహిళలు, బాలల చట్టాలు, భారతీయ న్యాయ సంహిత క్రిమినల్ చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పిఠాపురం ఐసీడీఎస్ అధికారి సీహెచ్‌ఎస్‌కే దుర్గాదేవి సూచించారు. పిఠాపురం మండలం కొత్త కందరాడలో గురువారం మిషన్ శక్తి కార్యక్రమంలో భాగంగా మహిళలు, ప్రజలకు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, ప్రజలకు ప్రధాన మంత్రి మాతృత్వ వందన యోజన, పలు చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మల్లాం పీహెచ్‌సీ సూపర్‌వైజర్ దేవకుమారి, ఐసీడీఎస్ సిబ్బంది, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

పీబీసీలో గుర్రపు డెక్క తొలగింపు ప్రారంభం



పీబీసీలో గుర్రపు డెక్క పనులు ప్రారంభించిన ఇరిగేషన్ అధికారులు

సామర్లకోట: స్థానిక ఐదు తూముల పిఠాపురం బ్రాంచి కెనాల్‌కు వెళుతున్న కాలువలో పెరిగిపోయిన గుర్రపు డెక్క తొలగింపు పనులను గురువారం ప్రారంభించారు. ఇరిగేషన్ ఈఈ జి.శేషగిరిరావు, ఎస్ఈ వేణుగోపాలరావు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సామర్లకోట నుంచి పీబీసీలో 12.75 కిలో మీటర్ల మేర పెరిగిన గుర్రపు డెక్కను జేసీబీ సాయంతో తొలగిస్తున్నారని, రూ.13.5 లక్షలతో ఈ పనులు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ యార్లగడ్డ రవిచంద్ర ప్రసాద్, ఇరిగేషన్ డీఈ శివకృష్ణ, రైతు సంఘ నాయకులు పాల్గొన్నారు.

అలవాట్ల మార్పుతో క్యాన్సర్ నియంత్రణ



సెమినార్‌లో మాట్లాడుతున్న ఆంకాలజిస్ట్ డాక్టర్ సృజన జోగా

కాకినాడ రూరల్: ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ సేవా సమితి ఆధ్వర్యంలో ఆరోగ్యవంతమైన జనాభా కోసం, శ్రేయోదాయకమైన రేపటి కోసం, క్యాన్సర్ కారక అలవాట్లను నిరోధించే లక్ష్యంగా స్థానిక ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎంఎస్ఎన్ క్యాంపస్‌లో సెమినార్‌ను నిర్వహించారు. అమెరికన్ ఆంకాలజీ ఇనిస్టిట్యూట్ సంయుక్తంగా నిర్వహించిన 'ఎంపవరింగ్ కమ్యూనిటీస్, ఎరైజింగ్ క్యాన్సర్ అవేర్నెస్ ఫర్ హెల్తీయర్ పాపులేషన్' అనే అంశంపై, బ్రేక్ ద హ్యాబిట్ ఫర్ ఏ సేఫర్ టుమారో అనే నినాదంతో సెమినార్ సాగింది. క్యాంపస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.ప్రశాంతిశ్రీ ముఖ్య అతిథిగా క్యాన్సర్ నిపుణులు, ప్రముఖ ఆంకాలజిస్ట్ డాక్టర్ సృజన జోగాతో విద్యార్థులను ఉద్దేశించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ సృజన మాట్లాడుతూ మన జీవితంలో అత్యధికంగా ఉపయోగించే ప్లాస్టిక్ వ్యర్థాలు, ఆహారపు అలవాట్లు, మాదకద్రవ్యాలు, పొగ తాగడం, వాయు, జల కాలుష్యాలు ప్రస్తుత ఈ సమాజంలో ప్రజల ఆరోగ్యాన్ని క్షీణింప చేస్తాయన్నారు. అత్యధిక కలుషిత వాతావరణంలో ఇవి మన శరీర భాగాలను ప్రభావితం చేసి ఏ విధంగా క్యాన్సర్ కారకాలు అవుతాయి, ఎలాంటి జాగ్రత్తల ద్వారా క్యాన్సర్ కారకాలను నివారించవచ్చు అనే వాటిపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ హరిబాబు అధ్యాపకులు డాక్టర్ స్టీఫెన్, డాక్టర్ అప్పారావు, డాక్టర్ నాని బాబు, శ్రీనివాసరావు, డాక్టర్ ఉమారజిత అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సమాజానికి నాటకాలు అవసరం

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): నేటి సమాజానికి నాటకాల అవసరం ఎంతో ఉందని తెలుగు నాటరంగ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ అన్నారు. అల్లూరి సీతారామరాజు నాటక కళాపరిషత్ ఆధ్వర్యంలో కాకినాడ సూర్యకళామందిరంలో గురువారం రాత్రి 24వ ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటికల పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమెరికా వంటి రాష్ట్రాల్లో చిన్నారులకు విద్యతోపాటు ఒక రంగంలో శిక్షణ ఇస్తారన్నారు. నాటిక రంగంలో చిన్నారులు కరువైపోయారన్నారు. ఒకప్పుడు చిన్నారులు లేకుండా నాటికలు ఉండేవి కాదన్నారు. రచయితలు కూడా చిన్నారులకు పాత్రలు కల్పించి రాసేవారన్నారు. నేడు తమ పిల్లలను నాటక రంగానికి పంపేందుకు తల్లితండ్రులు ముందుకు రావడం లేదన్నారు. కళాపరిషత్ ప్రధాన కార్యదర్శి పంపన దయానందబాబు మాట్లాడుతూ తమ పరిషత్ ఆధ్వర్యంలో చిన్నారులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామన్నారు. అనంతం పరిషత్ ఆధ్వర్యంలో ముఖ్య అతిథులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో పరిషత్ గౌరవ అధ్యక్షుడు కర్రి భామిరెడ్డి, అధ్యక్షులు కర్రి అచ్యుతరామారెడ్డి, వెంకట రామారావు, సుందర ప్రసాద్ పాల్గొన్నారు. అనంతరం అనకాపల్లి షిరిడి సాయి కల్చరల్ వేల్ఫేర్ అసోసియేషన్ వారి మలిసంధ్య నాటిక ఆద్యంతం ప్రేక్షకులను మైమరపించింది. రెండో ప్రదర్శనగా శ్రీకాకుళం రంగస్థల కళాకారుల సమాఖ్య ఆధ్వర్యంలో ప్రదర్శించిన ఆ సరసాల నాటిక అలరించింది.